సాక్షి
ఆదిలాబాద్

బుధవారం । 26 । జూన్ । 2024



లారీని ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు

ఆగి ఉన్న లారీని ప్రైవేట్ బస్సు ఢీకొన్న ఘటన కామారెడ్డిలో చోటు చేసుకుంది. ఇందులో జిల్లా వాసి ఒకరు మృతి చెందగా 28 మందికి గాయాలయ్యాయి. 8లో



పంటల నమోదే కీలకం

రైతుభరోసా అందించాలన్నా, అన్నదాతలు పండించిన పంట దిగుబడులను ప్రభుత్వం కొనాలన్నా పంటల నమోదు కీలకంగా మారనుంది. 9లో

గరిష్టం/కనిష్టం
35.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

హై.. రేట్!



నేరడిగొండ వద్ద హైవే పక్కన వ్యవసాయ భూములు

నేరడిగొండ వద్ద వ్యవసాయ భూములకు సంబంధించి ఎకరానికి ప్రభుత్వ విలువ గరిష్టంగా రూ.78 లక్షలు ఉంది. అక్కడ ఉన్న అనేక చేలకు రూ.60లక్షలకు పైబడి ఉండటం గమనార్హం. కాగా కనిష్టంగా కొన్ని వ్యవసాయ భూములకు ఈ ధర రూ.7లక్షలు పైబడి కూడా ఉన్నాయి. గతంలో జాతీయ రహదారి ఈ ప్రాంతం గుండా నిర్మించే సమయంలోనే వ్యవసాయ భూములకు సంబంధించి ఎకరం విలువ ప్రభుత్వం ఇలా అడ్డగోలుగా పెంచేసిందనే విమర్శలు ఉన్నాయి. భూములు కోల్పోయేవారు ప్రభుత్వం నుంచి పొందే పరిహారం కోసం అధికారులతో కుమ్మక్కై ఇలా చేశారనే ఆరోపణలున్నాయి. దీంతోనే అశాస్త్రీయంగా ఈ పెంపు జరిగిందనే చర్చ ఉంది. దీన్ని ఎవరు నిరోధించలేక పోయారు. జిల్లాలో హైవే పక్కన ఇంత రేటు మరెక్కడా లేకపోవడం గమనార్హం. – సాక్షి, ఆదిలాబాద్

- నేరడిగొండలో హైవే పక్కన భూమి హాట్ గురూ..
- ప్రభుత్వ విలువ ప్రకారమే ఎకరం రూ.78 లక్షలు
- నేషనల్ హైవే సమయంలో పెంచారనే ఆరోపణలు
- పరిహారం కోసం అడ్డదారులు తొక్కారనే విమర్శలు
- ఎన్‌హెచ్ పక్కన మిగతా చోట్ల మాత్రం రూ.6 లక్షల లోపే
- భూముల విలువల సవరణల నేపథ్యంలో తెరపైకి..

మిగతా చోట్ల రూ.6లక్షల లోపే..

మహారాష్ట్ర నుంచి పెన్‌గంగ నది బ్రిడ్జి దాటిన తర్వాత ఆదిలాబాద్ జిల్లా సరిహద్దు మొదలవుతుంది. అక్కడి నుంచి నేరడిగొండ మండలం ఆరెపల్లి వరకు జాతీయ రహదారి 44 జిల్లా పరిధిలోకి వస్తుంది. జైనథ్, ఆదిలాబాద్‌రూరల్, మావల, తలమడుగు, గుడిహత్నూర్, ఇచ్చోడ, నేరడిగొండ మండలాల్లోని అనేక గ్రామాలు హైవే పక్కన ఇరువైపులా ఉన్నాయి. వేలాది ఎకరాల వ్యవసాయ భూములు ఇరుపక్కలా ఉన్నాయి. కాగా ఒక్క నేరడిగొండ మినహాయిస్తే మిగతా మండలాల్లోని భూములకు ప్రభుత్వ విలువ కనిష్టంగా రూ.2లక్షల నుంచి గరిష్టంగా రూ.6లక్షల వరకు ఉన్నాయి. ఆదిలాబాద్‌రూరల్ మండల పరిధిలోని చాందా(టి) వద్ద రూ.3.37 లక్షలు, గుడిహత్నూర్ మండలంలోని మన్నూర్ వద్ద రూ.6లక్షలు ఉంది. ఒక్క నేరడిగొండలో మాత్రం హైవే పక్కన ఉన్న భూములకు ఇతర ప్రాంతాలతో పోల్చితే పది, అంతకంటే ఎక్కువ రేట్లు ఉండటం గమనార్హం. అలాగని మిగతా ప్రాంతాల్లోని వ్యవసాయ భూములతో పోల్చితే నేరడిగొండలో పెద్దగా అభివృద్ధి ఏమి లేదు. జిల్లా కేంద్రానికి శివారులో ఉండే మావలలో కూడా ఈ స్థాయిలో వ్యవసాయ భూముల విలువలు లేవు. అలాంటప్పుడు నేరడిగొండ భూముల రేట్లను ప్రభుత్వం అంతలా ఎందుకు పెంచిందనేది ఎవరికీ అర్థంకాని ప్రశ్న.

కొనసాగుతున్న సవరణలు..

రాష్ట్ర ప్రభుత్వం భూముల విలువలు పెంచేందుకు కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే యంత్రాంగం సవరణ మొదలుపెట్టింది. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపేందుకు సిద్ధమైంది. ఇదిలా ఉంటే హైవే పక్కన వ్యవసాయ భూముల ఎకరం విలువను ప్రభుత్వం తాజాగా రూ.40 లక్షల నుంచి రూ.50లక్షల వరకు పెంచే యోచనలో ఉన్నట్లు ఉన్నట్లు చెబుతున్నారు. ఆ వ్యవసాయ భూములు వెంచర్లుగా మారిన పక్షంలో రూ.కోటి వరకు పెంచే దిశగా కసరత్తు చేస్తుందని అధికార గణం అభిప్రాయ పడుతుంది. అయితే ప్రభుత్వం తాజాగా పెంచాలనుకుంటున్న ఈ విలువలు నేరడిగొండలో దాదాపు 15 ఏళ్ల క్రితమే అమలై ఉన్నాయంటే నమ్మాల్సిందే. కాగా ఇలా అశాస్త్రీయంగా కొన్నిచోట్ల భూముల ప్రభుత్వ విలువను పెంచే ఆస్కారం ఉన్నందున ఉన్నతాధికారులు సవరణ అంశాలను సూక్ష్మంగా పరిశీలించాలనే అభిప్రాయం ప్రజల నుంచి వ్యక్తమవుతుంది.

ధరణి రాకముందు నుంచే..

నేరడిగొండలో హైవే పక్కన వ్యవసాయ భూముల గరిష్ట విలువ రూ.78లక్షలు ఉంది. ఈ విలువలు ధరణి రాక ముందు నుంచే అమలులో ఉన్నాయి. ఎప్పుడు, ఎవరు ఇంతగా చేశారనే విషయంలో మాకు వివరాలు తెలియదు. ఎన్నో ఏళ్ల కిందట ఇవి అమల్లోకి వచ్చాయి.
– సంతోష్‌రెడ్డి, తహసీల్దార్, నేరడిగొండ

న్యూస్‌రీల్

28న జాబ్ మేళా

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు గాను ఈనెల 28న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి మిల్కా ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని సాత్నాల క్వార్టర్స్ ఆవరణలోగల ఉపాధి కల్పన కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంఎస్ఎన్ కంపెనీలో టెక్నీషియన్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. 18 నుంచి 20 ఏళ్లలోపు పురుష అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. రూ.11వేల నుంచి రూ.15వేల వరకు వేతనం ఉంటుందని, వివరాలకోసం 76599 78443, 80968 88868 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

విత్తనాల ఎంపికపై అవగాహన అవసరం



రైతునేస్తంలో పాల్గొన్న అధికారులు

ఇచ్చోడ: విత్తనాల ఎంపికపై రైతులకు అవగాహన అవసరమని వ్యవసాయ విశ్వవిద్యాలయం సహపరిశోధన సంచాలకులు మల్లారెడ్డి అన్నారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా స్థానిక రైతు వేదికలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. విత్తనాల ఎంపిక, వానాకాలం పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు సూచనలు చేశారు. ఇందులో ఇచ్చోడ ఏడీఏ రాంకిషన్, ఇచ్చోడ, గుడిహత్నూర్ ఏవోలు జాదవ్ కైలాస్, రేవతితోపాటు రెండు మండలాల ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా హెచ్‌డబ్ల్యూవో పరీక్ష

కైలాస్‌నగర్: టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ (హెచ్‌డబ్ల్యూవో) ఆన్‌లైన్ రాత పరీక్ష రెండో రోజు ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం ఉదయం నిర్వహించిన పరీక్షకు వంద మంది అభ్యర్థులకు గాను 69 మంది హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 67 మంది హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కె.పున్నారావు తెలిపారు.

పనులు వేగవంతం చేయాలి



పనులు పరిశీలిస్తున్న ఎస్ఈ చౌహాన్

బేల: విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు వేగవంతం చేయాలని ఆ శాఖ ఎస్ఈ చౌహాన్ అన్నారు. మండలంలోని సిర్సన్న శివారులో కొనసాగుతున్న సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అలాగే 33కేవీ లైన్ పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులు త్వరితగతిన నాణ్యతతో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయన వెంట డీఈ హరికృష్ణ, ఏడీఈ శ్రావణ్‌కుమార్, డీఈ ప్రభాకర్, ఏఈ సంతోష్ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

గుడిహత్నూర్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని మన్నూరు జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదివి జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సంతోశ్, ఎంపీపీ కేంద్రే జ్ఞాను, మాజీ ఏఎంసీ చైర్మన్ తిరుమల్ గౌడ్, పాండురంగ్, బలిరాం, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంపీల ప్రమాణ స్వీకారం





పార్లమెంట్ హాల్‌లో ఎంపీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న గోడం నగేశ్, గడ్డం వంశీకృష్ణ

ఆదిలాబాద్/చెన్నూర్: ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మంగళవారం పార్లమెంటులో ప్రమాణ స్వీకారం చేశారు. ప్రొటెం స్పీకర్ రాధామోహన్ సింగ్ వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. గోడం నగేష్ హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు. గడ్డం వంశీకృష్ణ సింగరేణి పారిశ్రామిక ప్రాంత ప్రాముఖ్యతను తెలియజేస్తూ సింగరేణి కార్మికుడి డ్రెస్‌లో ప్రమాణ స్వీకారం చేసి అందరి దృష్టిని ఆకర్షించారు. ఇంగ్లిషులో ప్రమాణ స్వీకారం చేశారు. వంశీకృష్ణకు చెన్నూర్‌కు చెందిన మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ బాపురెడ్డి, కౌన్సిలర్ పోగుల సతీశ్, శ్రీనివాస్ ఢిల్లీలో శుభాకాంక్షలు తెలిపారు.

కొనసాగుతున్న జూడాల సమ్మె



నిరసన చేపడుతున్న జూడాలు

- రెండో రోజూ అదే తీరు..
- అత్యవసర సేవలకు మినహాయింపు

ఆదిలాబాద్‌టౌన్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూనియర్ డాక్టర్లు చేపడుతున్న సమ్మె రెండో రోజు కొనసాగింది. వారంతా మంగళవారం రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఎదుట విధులు బహిష్కరించి నిరసన చేపట్టారు. అత్యవసర సేవలకు మాత్రం హాజరయ్యారు. ఈ సందర్భంగా జూడాల సంఘం అధ్యక్షుడు సందీప్ చారి మాట్లాడుతూ.. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేంత వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. స్టైఫండ్‌ను ప్రతినెలా పదో తేదీ లోపు చెల్లించాలని, ఇందుకు సంబంధించి ప్రత్యేక జీవో విడుదల చేయాలని కోరారు. కొత్తగా ఏర్పాటైన మెడికల్ కళాశాలలో విద్యార్థులకు హాస్టల్ వసతి, ట్రాన్స్‌పోర్టు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో పీజీ పూర్తి చేసిన విద్యార్థులను కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియమించాలన్నారు. గతంలో ప్రభుత్వం చెప్పిన ప్రకారం రూ.1లక్ష 25వేలు వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ డాక్టర్లు అరుణ్ కుమార్, రాజు యాదవ్, మౌనిక, సూరజ్, కావ్య, హారిక తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్షతోపాటు తులం బంగారం ఇవ్వాలి



లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్, వైస్‌చైర్మన్ జహీర్ రంజానీ తదితరులు

- ఎమ్మెల్యే పాయల్ శంకర్
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ

కైలాస్‌నగర్: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద ఆడబిడ్డలకు అందించే రూ.లక్ష ఆర్థికసాయంతో పాటు తులం బంగారం కూడా అందించాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆదిలాబాద్ అర్బన్, ఆదిలాబాద్ రూరల్, మావల మండలాలకు చెందిన 302 మంది షాదీముబారక్, కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు సంబంధించి రూ.3కోట్ల 2లక్షల 25వేల 032 విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. ఆదిలాబాద్‌అర్బన్‌లో షాదీముబారక్ 105, కల్యాణలక్ష్మి 79, మావలలో 23 షాదీ ముబారక్, 32 కల్యాణలక్ష్మి, ఆదిలాబాద్ రూరల్‌లో షాదీ ముబారక్ 3, కల్యాణలక్ష్మి 60 చొప్పున చెక్కులను రెవెన్యూ అధికారులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అమలు చేసిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అమలు చేయడం అభినందనీయమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన తులం బంగారం హామీ కూడా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, కౌన్సిలర్ లక్ష్మణ్, తహసీల్దార్లు ఎస్.శ్రీనివాస్, దిలీప్‌కుమార్, వేణుగోపాల్, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బేలలో

బేల: మండలకేంద్రంలోని గణేశ్‌గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 97మంది కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే శంకర్ చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సవాయిసింగ్, ఎంపీడీవో మహేందర్ కుమార్, జెడ్పీటీసీ అక్షిత సతీశ్‌పవార్, ఎంపీపీ ఠాక్రే వనిత,పార్టీ మండల అధ్యక్షుడు నిక్కమ్ తదితరులు పాల్గొన్నారు.

జైనథ్‌లో..

జైనథ్: మండలం కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే శంకర్ చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీవో రవీంద్రనాథ్, ఎంపీపీ గోవర్ధ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న సచిన్

ఎదులాపురం: భవన నిర్మాణ కార్మికులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను మెరుగుపరచాలని తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ అనుబంధం) జిల్లా అధ్యక్షుడు ఉమ్రే సచిన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కుమురంభీం భవనంలో మంగళవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమబోర్డులో కార్మిక సంఘానికి ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు నెలకు 15 రోజుల పని కూడా దొరకడం కష్టంగా మారిందన్నారు. ప్రమాద మరణానికి ఇచ్చే రూ.6 లక్షలను రూ.10 లక్షలకు పెంచాలని, సహజ మరణానికి అందించే రూ.లక్షను రూ.5 లక్షలకు పెంచాలని, మెటర్నిటీ, మ్యారేజ్ గిఫ్టుగా అందించే రూ. 30వేలను రూ.లక్షకు పెంచాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు మానుకుని, పెండింగ్‌లో ఉన్న జీవోలన్నింటినీ వెంటనే అమలు చేయాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు మధుకర్, నితీన్, రాజేశ్వర్, రాజు, తోసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

- కలెక్టర్ రాజర్షిషా
- నార్నూర్ మండలంలో పర్యటన
- నీతి ఆయోగ్‌లో భాగంగా పలు శాఖల అధికారులతో సమీక్ష




అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా, పక్కన మిల్కా తదితరులు

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని గిరి గ్రామాల్లో ప్రతీ కాన్పు ప్రభుత్వ ఆస్పత్రిలోనే అయ్యేలా చూడాలని, అలాగే సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. నీతి ఆయోగ్‌లో భాగంగా నార్నూర్ మండలం ఎంపికైన నేపథ్యంలో ఆయన మంగళవారం మండలంలో పర్యటించారు. జామ్‌డా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందుతున్న తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఐదేళ్లు దాటిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సీడీపీవో శారదను ఆదేశించారు. చిన్నారుల శారీరక ఎదుగుదలలో భాగంగా బరువు, ఎత్తు వంటి వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. అనంతరం ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తాతో కలిసి రాజులగూడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

గర్భిణులకు పోషకాహారం అందించాలి

ఏజెన్సీ పరిధిలోని గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒక పూట పోషకాహారంతో పాటు ఐటీడీఏ ద్వారా ఫలాలు అందేలా చూడాలన్నారు. నార్నూర్ సబ్‌సెంటర్‌లో ఇద్దరు ఏఎన్ఎంలు ఉన్నా కేవలం 74శాతం మాత్రమే ఏఎన్సీల నమోదు ఏంటని అధికారులు, సిబ్బందిని ప్రశ్నించారు. గర్భిణుల వివరాలను స్థానిక ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీల ద్వారా తీసుకొని వందశాతం నమోదు అయ్యేలా చూడాలన్నారు. బాబేఝరి, గుండాల, భీంపూర్ పంచాయతీల పరిధిలోని పలు గ్రామాలకు వానాకాలంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయన్నారు. ఈ నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఐటీడీఏ ద్వారా మంజూరైన పనుల్లో జాప్యంపై ఈఈ భీంరావును ప్రశ్నించారు. పనుల్లో వేగం పెంచాలన్నారు. సమస్యలు ఉన్న పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.2లక్షలు మంజూరు చేస్తామని కలెక్టర్ ప్రకటించారు. వీటిని తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణం కోసం వెచ్చించాలన్నారు. నార్నూర్‌లో తాగునీటి సమస్య ఉందని, తరచూ స్థానికుల నుంచి ఫోన్లు వస్తున్నాయన్నారు. సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుభాషిణిని ఆదేశించారు. ఒకవేళ మిషన్ భగీరథ నీటి సరఫ రాకు అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో సా యన్న, డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి మిల్కా, ఐటీడీఏ ఈఈ భీంరావు, డీపీఆర్వో తిరుమల, డీఈ శివప్రసాద్, ఏఈలు సునీల్ రాథోడ్, లింగన్న, ఎంపీడీవో జవహర్, తహసీల్దార్ రాజలింగు, సీడీపీవో శారద, ఏంఈవో ఆశన్న, వివిధ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా ప్రారంభించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

ఉట్నూర్‌రూరల్: ఇంద్రవెల్లిలోని అమరవీరుల స్తూపం, కెస్లాపూర్‌లోని నాగోబా ఆలయం వద్ద చేపట్టనున్న పలు అభివృద్ధి పనులను త్వరగా ప్రారంభించి మూడు నెలల్లో పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ కార్యాలయంలో పీవో ఖుష్బూ గుప్తాతో కలిసి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్తూపం వద్ద ప్రహరీ, బోర్‌వెల్, వీధి దీపాలు, మెట్లతో పాటు నాగోబా ఆలయం వద్ద కమ్యూనిటీ హాల్, మరుగుదొడ్లు, బోర్‌వెల్, పంపుసెట్, విద్యుత్‌దీపాలు వంటి తదితర పనులను సెప్టెంబర్ 30 లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. వీటికి సంబంధించి అగ్రిమెంట్ పూర్తయి 15 రోజులు గడుస్తున్నా పనులు ఇంకా ఎందుకు ప్రారంభించలేదని అధికారులను ప్రశ్నించారు. త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఉట్నూర్ పరిధిలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇందులో ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి



మాట్లాడుతున్న శ్రీధర్

ఆదిలాబాద్‌టౌన్: రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి శ్రీధర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఖుర్షీద్‌నగర్ పట్టణ ఆరోగ్యకేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బందితో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య కేంద్ర పరిధిలో మొత్తం 12,468 మంది జనాభా ఉండగా, 30 ఏళ్ల పైబడిన వారికి ప్రతినెలా 10 శాతం ఎన్‌సీడీ స్క్రీనింగ్ చేస్తున్నట్లు తెలిపారు. రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ తదితర వ్యాధులకు పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాస్, రమణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైల్వే క్వార్టర్స్‌లో నాగుపాము హల్‌చల్


పామును పట్టుకున్న ఫయాజ్..

బాసర : మండల కేంద్రంలోని రవీంద్రాపూర్ కాలనీలోని రైల్వే క్వార్టర్స్‌లో నాగుపాము మంగళవారం హల్‌చల్ చేసింది. పాము కనిపించడంతో కాలనీవాసులు ఆందోళన చెందారు. వెంటనే పాములు పట్టే వ్యక్తి ఫయాజ్‌కు సమాచారం అందించారు. అతను వచ్చి పామును పట్టుకోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. వర్షాకాలం దృష్ట్యా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

మేకల మందపై కుక్కల దాడి


కుక్కల దాడిలో మృతి చెందిన మేకలు

తాంసి: మండలంలోని పాలోది గ్రామ శివారులో మేత కోసం వెళ్లిన మేకల మందపై కుక్కలు మంగళవారం దాడి చేశాయి. గ్రామానికి చెందిన నేరెళ్ల రవి మేకల మందను తీసుకొని గుట్టకు మేతకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో అక్కడ గుంపుగా ఉన్న కుక్కలు మందపై దాడి చేశాయి. ఈ ఘటనలో మూడు మేకలు చనిపోయాయి. మరో నాలుగు తీవ్రంగా గాయపడగా వాటికి పశువైద్య సిబ్బంది ప్రవీణ్ వైద్యం అందించారు. చనిపోయిన మేకల విలువ రూ.30వేల వరకు ఉంటుందని కాపరి రవి తెలిపాడు. ప్రభుత్వం తరపున పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని అంకుసాపూర్ రోడ్డు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సోనియా తెలిపారు. మృతుడికి సుమారు 50 సంవత్సరాలు ఉంటాయని, ఎలాంటి ఆధారాలు లభించలేదని, శరీరంపై ఎలాంటి గాయాలు లేవని పేర్కొన్నారు. మృతదేహాన్ని సిర్పూర్(టి)లోని మార్చురీకి తరలించామని తెలిపారు. ఎవరైనా గుర్తుపడితే రూరల్ పోలీసులను సంప్రదించాలని ఎస్సై కోరారు.

భైంసా డిగ్రీ కళాశాలకు మహర్దశ..!

- పీఎం ఉష కింద రూ.5 కోట్లు మంజూరు
- వసతుల కల్పనతో విద్యార్థులకు ప్రయోజనం


భైంసాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

భైంసాటౌన్: పట్టణంలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీఎం ఉష(ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్ష అభియాన్) పథకానికి ఎంపికైంది. ఈ మేరకు కళాశాల అభివృద్ధికి రూ.5 కోట్లు నిధులు కేటాయిస్తూ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ప్రొసీడింగ్స్ జారీ చేశారు. న్యాక్ గుర్తింపు ఉన్న పలు కళాశాలలను జాతీయస్థాయిలో ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఎంపికచేసి అభివృద్ధి చేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రం నుంచి 65 కళాశాల ఎంపికకు ప్రతిపాదనలు పంపగా, వీటిలో 13 కళాశాలలను ఎంపిక చేస్తూ నిధులు కేటాయించింది. ఇందులో భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాల చోటు దక్కించుకుంది. ఫలితంగా పీఎం–ఉష కింద కళాశాలలో విద్యార్థులకు నూతనంగా తరగతి గదుల నిర్మాణం, ఇతర మరమ్మతులు, ఫర్నిచర్, కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ బోర్డులు,వసతులు అందుబాటులోకి రానున్నాయి.

అధ్యాపక బృందం కృషితో...

భైంసా పట్టణంలో పార్డి(బి) బైపాస్‌రోడ్‌లో జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1995లో ఏర్పాటైంది. మొదట బీఏ, బీకాం కోర్సులతో కళాశాల ప్రారంభం కాగా, 2005 బీఎస్సీ, 2018లో ఉర్దూ, ఇంగ్లిష్ మీడియంలో బోధన ప్రారంభించారు. అదే సంవత్సరం కంప్యూటర్ సైన్స్ కోర్సు కూడా అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్ మీడియంలో కలిపి మొత్తం 600 మంది విద్యార్థులు ఉన్నారు. కళాశాల ఏర్పడిన దాదాపు 25 ఏళ్ల వరకు న్యాక్ గుర్తింపు పొందలేదు. దీంతో ప్రస్తుత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుధాకర్ నేతృత్వంలోని అధ్యాపక బృందం విశేష కృషితో 2021–22లో న్యాక్ బి గ్రేడ్ గుర్తింపు దక్కించుకుంది. ఉన్నత విద్యామండలి నిధులు కేటాయించాలంటే న్యాక్ గుర్తింపు తప్పనిసరి. దీన్ని గుర్తించిన అధ్యాపకులు ఈ మేరకు కళాశాలకు న్యాక్ గుర్తింపు కోసం కలిసికట్టుగా పనిచేశారు. దాతల సహకారంతో కళాశాలలో వసతుల కల్పన, కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు, పూర్తిస్థాయిలో బోధనా సిబ్బంది అందుబాటులో ఉంచడంతో న్యాక్ సంస్థ గుర్తించి బి గ్రేడ్ ఇచ్చింది. న్యాక్ గుర్తింపు ఉండడంతో పీఎం–ఉష కింద కళాశాలలో వసతుల కల్పనకు రూ.5 కోట్లతో ప్రిన్సిపాల్ సుధాకర్ ప్రతిపాదనలు పంపగా, ఆమోదించిన కేంద్రం ఈ మేరకు నిధులు కేటాయించింది.

ప్రజాప్రతినిధులు, నాయకులు దృష్టి సారించాలి..

భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. స్థానికంగా కళాశాలల్లో సరైన వసతులు లేకపోవడంతో నియోజకవర్గం నుంచి ఎంతోమంది విద్యార్థులు ఉన్నత విద్య కోసం నిజామాబాద్, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్తున్నారు. స్థానిక డిగ్రీ కళాశాల ప్రస్తుతం పీఎం–ఉష కింద ఎంపికైన నేపథ్యంలో అదనపు తరగతి గదులు, ఫర్నిచర్, కంప్యూటర్ టేబుళ్లు, రీడింగ్ టేబుళ్లు, డ్యూయల్ డెస్క్‌లు, ప్రొజెక్టర్లు, ఇతర వసతులు అందుబాటులోకి రానున్నాయి. అయితే, స్థానికంగా డిగ్రీ కళాశాలకు అనుసంధానంగా బాలికల కోసం హాస్టల్ మంజూరు చేసేలా ప్రజాప్రతినిధులు, నాయకులు కృషి చేయాలని అధ్యాపకులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. తద్వారా కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగి న్యాక్ ఏ గ్రేడ్ గుర్తింపు వచ్చే అవకాశముందని చెబుతున్నారు.

సెమినార్లతో జాతీయస్థాయి గుర్తింపు...

మారుమూల ప్రాంతంలో ఉన్న భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు జాతీయస్థాయిలో గుర్తింపు తేవాలనుకున్న అధ్యాపక బృందం ఇందుకుగాను జాతీయస్థాయి సెమినార్లను నిర్వహించాలని నిర్ణయించింది. తొలుత వృక్షశాస్త్రం అధ్యాపకులు డాక్టర్ వెల్మల మధు ఆధ్వర్యంలో ఒకరోజు జాతీయ సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు దేశంలోని వివిధ యూనివర్సిటీల నుంచి ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పరిశోధన విద్యార్థులు హాజరయ్యారు. అనంతరం హిందీ, ఆర్థిక శాస్త్రం ఆధ్వర్యంలో సైతం జాతీయస్థాయి సెమినార్లు నిర్వహించారు. ఫలితంగా భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చింది. ఫలితంగా ప్రస్తుతం పీఎం–ఉష కింద ఎంపికకు దోహదపడింది.

ఆనందంగా ఉంది...



భైంసా డిగ్రీ కళాశాల పీఎం ఉష పథకం కింద ఎంపికైంది. రూ.5 కోట్లు మంజూరు చేయడం ఆనందంగా ఉంది. కళాశాలకు న్యాక్ గుర్తింపు కోసం అధ్యాపక బృందం విశేషంగా కృషి చేసింది. జాతీయస్థాయి సెమినార్లు నిర్వహించడం, పీహెచ్‌డీ చేసిన అధ్యాపకులు ఉండడంతో కళాశాలకు గుర్తింపు వచ్చింది. దీంతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, దాతల సహకారంతో విద్యార్థులకు మెరుగైన విద్య, వసతులు కల్పించేందుకు కృషి చేస్తాం.

– డాక్టర్ ఎం.సుధాకర్, ప్రిన్సిపాల్, భైంసా

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


కుమ్మరి సాయన్న(ఫైల్)

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి గ్రామానికి చెందిన కుమ్మరి సాయన్న(55) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. లోకేశ్వరం ఎస్సై మోహన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. కుమ్మరి సాయన్న తన బైక్‌పై ఖాళీ గ్యాస్ సిలిండర్ తీసుకుని పంచగుడికి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. లోకేశ్వరం గ్రామ శివారులో బైక్ అదుపు తప్పడంతో కల్వర్టును ఢీకొని కిందపడ్డాడు. అతడి తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడు. మృతుడికి భార్య గంగవ్వ, కుమార్తెలు సంగీత, స్వప్న ఉన్నారు. స్వప్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిర్మల్‌లో ఆగని కుక్కల దాడులు

నిర్మల్‌టౌన్: నిర్మల్‌లో వీధికుక్కల దాడులు కొనసాగుతున్నాయి. వారం వ్యవధిలో నాలుగుసార్లు దాడులు చేశాయి. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఓ వ్యక్తి సోమవారం రాత్రి విధులను ముగించుకుని ఇంటికి వెళ్లే క్రమంలో కుక్కలు ఒకసారి దాడిచేసి గాయపరిచాయి. గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పట్టణంలో నిత్యం ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా అధికారులు కుక్కల తరలింపునకు చర్యలు చేపట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి వీధికుక్కల తరలించాలని డిమాండ్ చేస్తున్నారు.

సీసీఐ క్వార్టర్స్‌లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో గల సీసీఐ క్వార్టర్స్‌లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడు నర్సింహస్వామి తెలిపిన ప్రకారం.. సీసీఐ యాజమాన్యం నుంచి తమకు రావాల్సిన డబ్బులు రాకపోవడంతో క్వార్టర్‌లోనే ఉంటున్నట్లు తెలిపాడు. ఇటీవల అధికారులు ఖాళీ చేయమని చెప్పారని పేర్కొన్నాడు. దీంతో ఇంటి సామగ్రి అక్కడే వదిలి కొద్ది రోజులుగా వేరేచోట ఉంటున్నట్లు తెలిపాడు. ఇంట్లో సిలిండర్, ఫ్రిడ్జ్, ఫర్నిచర్ ఉండగా వాటిని దొంగలు ఎత్తుకెళ్లారని పేర్కొన్నాడు. మంగళవారం ఉదయం వెళ్లి చూసే సరికి తాళం పగలగొట్టి ఉందని, వస్తువులు కనిపించకుండా పోయాయని తెలిపాడు. ఈమేరకు వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

పంచాయతీ కార్మికుడికి కరెంటు షాక్

లక్ష్మణచాంద: మండలంలోని చింతల్‌చాంద గ్రామ పంచాయతీ కార్మికుడు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. గ్రామ పంచాయతీలో సాయి క్రిష్ణ మల్టీపర్పస్ వర్కర్‌గా ఐదేళ్లుగా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం గ్రామంలో విద్యుత్ బల్బులు పెట్టడానికి సాయి క్రిష్ణ తన తోటి కార్మికులతో కలిసి వెళ్లాడు. బల్బులు అమర్చే క్రమంలో షాక్‌కు గురయ్యాడు. తీవ్రంగా గాయపడ్డాడు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే సాయిక్రిష్ణ ప్రమాదానికి గురయ్యాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై మండల విద్యుత్ ఏఈ మహేశ్‌ను వివరణ కోరగా చింతల్‌చాంద సబ్‌స్టేషన్ జేఎల్‌ఎం దుర్గం తిరుపతికి పంచాయతీ కార్మికుడు సాయి క్రిష్ణ ఫోన్ చేసి ఎల్‌సీ తీసుకుని గ్రామంలో బల్బులు పెట్టాడని, తర్వాత జేఎల్‌ఎం దుర్గం తిరుపతికి ఫోన్‌చేసి ఎల్‌సీ రిటన్ చేశాడన్నారు. అనంతరం తమకు సమాచారం ఇవ్వకుండా మరోచోట 15 కేవీ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను ఆఫ్‌చేసి దానిపై విద్యుత్ పోల్‌కు బల్బును పెట్టడానికి స్తంభం ఎక్కుతుండగా 6.3 కేవీ విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురయ్యాడని వెల్లడించారు. స్తంభంపై నుంచి కిందపడడంతో తలకు గాయాలయ్యాయి. విద్యుత్ షాక్‌తో ఎడమ చేయి, మెడ, వీపు భాగం కాలింది. గ్రామస్తులు అతడిని నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం సాయిక్రిష్ణ చికిత్స పొందుతున్నాడు.


నిర్మల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సాయి క్రిష్ణ

16 ఆటోలు సీజ్

ఎదులాపురం: సరైన ధ్రువపత్రాలు లేని 16 ఆటోలను సీజ్ చేసినట్లు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ హరీంద్ర కుమార్ తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక బస్టాండ్ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా ఫిట్‌నెస్, లైసెన్స్, ఇన్సూరెన్స్ తదితర పత్రాలు లేని 16 ఆటోలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.


సీజ్ చేసిన ఆటోలతో ఎంవీఐ హరింద్రకుమార్

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు

- ఆదిలాబాద్ జిల్లా వాసి మృతి.. 28 మందికి గాయాలు
- కామారెడ్డిలో ఘటన

ఆదిలాబాద్‌టౌన్/కామారెడ్డి క్రైం: కామారెడ్డి జిల్లా కేంద్రం సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున రోడ్డుపై ఆగి ఉన్న లారీని ప్రైవేట్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, 28 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆదిలాబాద్‌కు చెందిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు 34 మంది ప్రయాణికులతో సోమవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో హైదరాబాద్‌కు బయలుదేరింది. మంగళవారం తెల్లవారుజామున దాదాపు 3 గంటల ప్రాంతంలో కామారెడ్డి సమీపంలోకి రాగానే క్యాసంపల్లి శివారులో జాతీయ రహదారిపై నిలిపి ఉంచిన లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న ఆదిలాబాద్‌లోని అంబేడ్కర్‌నగర్ కాలనీకి చెందిన అఫ్సర్‌ఖాన్ (25) మృతి చెందగా, మరో 28 మందికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో రూరల్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ షేక్ రఫీక్‌తోపాటు మరో ప్రయాణికుడు మోబీన్‌కు తీవ్ర గాయాలుకాగా వైద్యులు నిజామాబాద్‌కు రిఫర్ చేశారు. గాయాలపాలైన వారంతా ఆదిలాబాద్, నిర్మల్ ప్రాంతాలకు చెందిన వారే. అఫ్సర్‌ఖాన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నటట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.


అఫ్సర్‌ఖాన్ (ఫైల్)


బస్సు క్యాబిన్‌లో అఫ్సర్‌ఖాన్ మృతదేహం

బైక్ అదుపు తప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు


క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

జైనథ్: మండలంలోని బెల్గాం వద్ద బైక్ అదపు తప్పిన ఘటనలో భీంపూర్ మండలం గుంజాల గ్రామానికి చెందిన ఆత్రం భీంరావ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. భీంరావ్ మంగళవారం బేల నుంచి ఆదిలాబాద్ వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో బెల్గాం బ్రిడ్జి వద్ద బైక్ అదపు తప్పి కింద పడిపోయాడు. అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే శంకర్ తన వాహనాన్ని ఆపి 108కు సమాచారం అందించారు. బాధితుడిని బయటకు అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు. ఈ ప్రమాదంలో బైక్ పూర్తిగా దెబ్బతినగా, భీంరావ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి.

పరస్పర దాడిలో ఇరువర్గాలపై కేసు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామం పోచంపాడు శివారులోని ఓ భూ వివాదంలో పరస్పర దాడిలో ఇరువర్గాలపై హాజీపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోచంపాడు శివారులోని మూడు ఎకరాల భూమిలో నస్పూర్‌కు చెందిన బోరిగం వెంకటేశ్ విత్తనాలు నాటుతుండగా నస్పూర్‌కు చెందిన సామ్యూల్, అతడి సోదరుడు ప్రేమ్ సాగర్ అడ్డుకున్నారు. ఆ భూమి తమదంటే తమదని వాగ్వాదానికి దిగి గొడవ పడ్డారు. హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపైఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పద్మనగర్‌లో చోరీ

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని పద్మనగర్ కాలనీకి చెందిన అడేటి సాయికిరణ్ ఇంట్లో సోమవారం చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు నాలుగు తులాల బంగారం, 40 తులాల వెండి ఎత్తుకెళ్లారు. సీఐ రవీందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాయికిరణ్ తన తల్లి లక్ష్మి ఆరోగ్య బాగాలేకపోవడంతో మంచిర్యాలలోని ఓ ప్రవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. మంచిర్యాల నుంచి రాత్రి ఇంటికి వచ్చి తాళం తీస్తే రాలేదు.

వెనుకాలకు వెళ్లి చూడగా తలుపు తెరిచి ఉంది. లోపలికి వెళ్లి చూ డగా బీరువా పగులగొట్టి బంగారం, వెండి నగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు. ఆదివాసీల భూముల కబ్జాపై చర్యలు తీసుకోవాలి


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ

ప్రైవేట్ చేతిలోకి కడెం హరిత రిసార్ట్

కడెం: మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌ను పర్యాటక శాఖ ప్రైవేటుకు అప్పగిచ్చింది. కడెం ప్రాజెక్టు పరిసరా ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో పర్యాటక శాఖ 2015లో ఇక్కడ 12 ఏసీ కాటేజీలతో రిసార్ట్ నిర్మించింది. తొమ్మిదేళ్లుగా టూరిజం కార్పొరేషన్ రిసార్ట్‌ను నడిపించింది. ప్రస్తుతం ఖానాపూర్‌కు చెందిన మాజీ ఏపీపీఎస్సీ సభ్యుడు పైడిపల్లి రవీందర్‌రావుకు అప్పగిస్తూ లేఖ విడుదల చేసింది. రిసార్ట్ ప్రైవేటుకు అప్పగించడంతో తాము ఉపాధి కోల్పోతామని సిబ్బంది తెలిపారు. ఈమేరకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న హరిత రిసార్ట్ సిబ్బంది

సెల్లార్ ప్రహరీ కూలి నలుగురికి గాయాలు

- ముందస్తుగా హెచ్చరించిన మున్సిపల్ కమిషనర్
- నోటీసులు అందజేసినా బేఖాతర్ చేసిన ఇంటి యజమాని


స్వల్పగాయాలతో రాములు


తీవ్రంగా గాయపడిన గంగరాజు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రం మంచిర్యాలలోని వెంకటేశ్వర టాకీస్ చౌరస్తా సమీపంలో మంగళవారం సెల్లార్ ప్రహరీ కూలి నలుగురు కూలీలు గాయపడ్డారు. ఇటీవల సెల్లార్ ప్రహరీ కూలి ముగ్గురు మృతిచెందిన ఘటన మరవకముందే మరో ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలకు చెందిన వెన్నంపెల్లి లక్ష్మీనారాయణ నూతన భవన నిర్మాణం చేపడుతున్నాడు. సెల్లార్ కోసం పక్కనే ఇటుకలతో పది రోజుల క్రితం ప్రహరీ నిర్మించారు. పక్కనే సిమెంట్ పిల్లర్ల మధ్యలో మట్టి పనులు చేస్తుండగా ఒక్కసారిగా ఇటుకల ప్రహరీ కూలి కూలీలపై పడింది. దీంతో కాసిపేట మండలం ధర్మారావుపేటకు చెందిన అరికెల గంగారాజు తీవ్రంగా, శ్రీరాంపూర్‌కు చెందిన పశుల మల్లయ్య, సీతరామ్‌పల్లికి చెందిన ఐటిపాముల రాములు, సోమగూడంకు చెందిన నర్యయ్యలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక సీఐ బన్సిలాల్ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసినట్లు తెలిపారు.


ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ బన్సీలాల్

నోటీసులు ఇచ్చినా రక్షణ చర్యలు పాటించలేదు..

ఈ నెల 13న జిల్లా కేంద్రంలో సెల్లార్ ప్రహరీ కూలి ముగ్గురు కూలీలు దుర్మరణం చెందిన నేపథ్యంలో నూతనంగా భవన నిర్మాణాలు చేపడుతున్న ఇళ్ల యజమానులకు నోటీసులు ఇచ్చారు. పనుల్లో, సెల్లార్ నిర్మాణంలో కూలీలకు రక్షణ చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో లక్ష్మీనారాయణకు సైతం నోటీస్ అందజేశారు. అయినా నిబంధనలు బేఖాతర్ చేస్తూ కూలీలకు కనీస రక్షణ చర్యలు చేపట్టకపోవడంపై కమిషనర్ ఇంటి యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

బాసరలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు


బాసరలో హోమం నిర్వహిస్తున్న పండితులు..

బాసర: నిర్మల్ జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసరలో ముగ్గురు అమ్మవార్లు శ్రీమహాలక్ష్మి, మహాకాళి, సరస్వతి అమ్మవార్లకు మంగళవారం అంగారక చ తుర్థి ,సంకట హర చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూ జలు నిర్వహించారు. మాసోత్సవ పూజ కలిసి రావడంతో అభిషేకం, అర్చన శ్రీసరస్వతి పూజ, చండీహోమం, వేద పారాయణం, విగ్నేశ్వర పూజ జరిపి ంచారు. చిన్నారులకు అక్షరాభ్యాసం, పూజలు నిర్వహిస్తే ఆ సరస్వతి అమ్మవారి ఆశీస్సులతోపాటు శ్రీవిఘ్నేశ్వరుని ఆశీస్సులు ఉంటాయని వారికి విద్యాబుద్ధులతోపాటు, ఉద్యోగం, వ్యాపారంలో అన్నిరంగాల్లో ఎదుగుతారని భక్తుల నమ్మకం.


దీప జ్యోతి వెలిగిస్తున్న వేదపండితులు..